# దరిద్రానికి నేస్తం 'హస్తం'

- రుణమాఫీని అడ్డుకున్నది కాంగ్రెస్సే..
- ఏడాదిన్నరలో గోదావరి జలాలు
- కామారెడ్డిలో ప్రతి ఎకరానికీ నీళ్లిస్తాం
- సీఎం కేసీఆర్ రాకతో బ్రహ్మాండంగా అభివృద్ధి
- భిక్కనూర్, బీబీపేట రోడ్‌షోలో మంత్రి కేటీఆర్





బీబీపేట రోడ్ షో లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన విప్ గంపగోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, సమన్వయ కమిటీ సభ్యుడు సుభాష్‌రెడ్డి

నిజామాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ భిక్కనూర్, బీబీపేట:

కామారెడ్డి నుంచి పోటీచేస్తున్న కేసీఆర్‌తో ఈ ప్రాంతానికి నిధుల వరద వస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ముఖ్యమంత్రే మీ ఎమ్మెల్యే అయితే అభివృద్ధికి కొదువ లేదంటూ ప్రజలకు వివరించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కామారెడ్డిలో కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. వాడూ వీడు వచ్చి చెప్పే అబద్ధాలను పట్టించుకోవద్దన్నారు. దరిద్రానికి నేస్తం హస్తం పార్టీ అంటూ కేటీఆర్ అభివర్ణించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి నేటి వరకు 50ఏండ్ల పాటు ఏలిన కాంగ్రెస్ పార్టీ చేసిన మేలు ఏమిటో ప్రజలు ఆలోచించాలన్నారు. ఉన్న తెలంగాణను ఊడ్చేసి ఆంధ్రాలో కలిపి మనల్ని మోసం చేసిందే కాంగ్రెస్ అంటూ మండిపడ్డారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు వారి మదిలో ఎందుకు రాలేదో ఆలోచించాలన్నారు. పేదల బాగు కోసం ఆలోచించే నాయకుడు కేసీఆర్ అన్నారు. రైతుబిడ్డగా, కర్షకుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా కేసీఆర్ అనేక స్కీములను తీసుకువచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారని చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్, బీబీపేట మండలాల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ శనివారం రోడ్ షో నిర్వహించారు.

### పట్వారీ వ్యవస్థతో బతుకులు బుగ్గి..

కాంగ్రెస్ పార్టీ పట్వారీ వ్యవస్థ తెస్తామని చెబుతుండడాన్ని ప్రజలంతా గుర్తించాలని కేటీఆర్ అన్నారు. పట్వారీ వ్యవస్థ వస్తే మన బతుకులు ఆగమవుతాయన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఏకంగా 10 హెచ్‌పీ మోటార్లతో నీళ్లను తోడుకోవచ్చంటూ చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పొలాల్లో 10హెచ్‌పీ మోటార్లు బిగిస్తే భూగర్భ జలం మిగులుతుందా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకుంటేనే ప్రజలందరూ సౌభాగ్యంగా ఉంటారన్నారు. రుణమాఫీ అందని రైతులు ఫికర్ పడాల్సిన పనిలేదన్నారు. వారికి కొత్త ప్రభుత్వంలో నిధులు విడుదల చేసి ఆదుకుంటామన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ వారేనని చెప్పారు. రైతుబీమా మాదిరిగానే తెల్లరేషన్ కార్డుదారులకు కేసీఆర్ బీమా పథకం అందిస్తున్నామన్నారు. దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం సరఫరా చేయబోతున్నట్లుగా చెప్పారు. గ్యాస్ సిలిండర్ ధరలను మోదీ పెంచితే కేసీఆర్ తగ్గించి రూ.400కే అందించేందుకు సిద్ధమయ్యారన్నారు. అసైన్డ్ భూములున్న వారికి హక్కు పత్రాలు కల్పిస్తామని, దీంతో దళిత, గిరిజన, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. కామారెడ్డికి ఏడాదిన్నర కాలంలోనే గోదావరి జలాలను అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికీ నీళ్లిచ్చి తీరుతామన్నారు.

### కేసీఆర్ వచ్చినంకనే వ్యవసాయం పండుగైంది..

కేసీఆర్ పాలనలో రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలతోనే ఈంచు జాగా ఖాళీ లేకుండా పంటలు పండుతున్నాయన్నారు. దాని ఫలితంగానే రోడ్లపై పుట్లకు పుట్లు వడ్లు కనిపిస్తున్నాయన్నారు. కేసీఆర్ వచ్చినంకనే వ్యవసాయం బాగుపడ్డదని, 24గంటల కరెంట్ వస్తుంటే రేవంత్ రెడ్డికి కనిపించడం లేదంటూ ఎద్దేవా చేశారు. అనుమానపు పక్షులు కాంగ్రెసోళ్లు అని చెప్పారు. కరెంట్ వస్తుందో లేదా తెలుసుకోవాలంటే బీబీపేటలోని ఏ ఊరికైనా వెళ్లి కరెంట్ తీగలు పట్టుకుంటే సరిపోతుందని తెలిపారు. ఒకప్పుడు కాలిపోయే మోటార్లు, పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఎండిపోయిన చెరువులు, కూలిపోయిన తూములంటూ నాటి సమైక్య రాష్ట్రంలోని స్థితిగతులను కేటీఆర్ వివరించారు. 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులుంటే కేవలం తెలంగాణలోనే పింఛన్లు అందుతున్నాయన్నారు. బీడీలు చుట్టే మహిళలకు రూ.2వేలు అందిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. కటాఫ్ డేట్‌ను 2023 చేసి అందరికీ పింఛన్లు అందిస్తామని, అందర్నీ కాపాడుకుంటామన్నారు. కేసీఆర్ రాక ముందు రైతుబంధు ఉండేనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పుర్రెలో ఇలాంటి ఆలోచనే లేదన్నారు. కేసీఆర్ కూడా రైతు కష్టం తెలిసిన బిడ్డే కాబట్టే ఎకరానికి రూ.10వేలు ఇస్తున్నారన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయిన తర్వాత ఎకరానికి రూ.16వేలు ఇవ్వబోతున్నామన్నారు. ఆసరా పింఛన్లను రూ.5వేలు చేయబోతున్నామన్నారు. అత్తలకు పింఛన్లు వస్తున్నాయి.. మరి కోడళ్ల సంగతి ఏందనే వారికి డిసెంబర్ 3 తర్వాత సౌభాగ్యలక్ష్మి రూపంలో నెలకు రూ.3వేలు అందించనున్నట్లు కేటీఆర్ వివరించారు.

# కాంగ్రెస్‌తో గోస.. బీఆర్‌ఎస్‌తోనే భరోసా..

- కాంగ్రెస్, బీజేపీలు అరచేతిలో వైకుంఠం చూపిస్తాయి..
- కాంగ్రెసోళ్లు వస్తే కరెంటు బంద్ తప్పదు
- కరువు, కర్ఫ్యూలేని పాలన సీఎం కేసీఆర్‌ది..
- రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సాటాపూర్, నిజామాబాద్, మాక్లూర్, నందిపేటలో పర్యటన

బోధన్/ ఖలీల్‌వాడి/ మాక్లూర్/ నందిపేట, నవంబర్ 18: కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని, ఒకనాడు రైతులు కరెంట్ కోసం ఎంతో గోస పడ్డారని, మళ్లీ ఆ కష్టాలు రాకూడదని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్‌తో గోసపడతామని, బీఆర్‌ఎస్‌తోనే భరోసా ఉంటుందని వివరించారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించి బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నిజామాబాద్ జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. బోధన్ నియోజకవర్గం రెంజల్ మండలం సాటాపూర్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం నిజామాబాద్ నగరంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అక్కడి నుంచి మాక్లూర్ మండలం మానిక్‌బండార్, నందిపేట మండల కేంద్రాల్లో ఆర్మూర్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఆయా సభల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కొత్తకొత్త మ్యానిఫెస్టోతో వస్తోందన్నారు. కర్ణాటకలో తాము వస్తే ఐదు గ్యారెంటీలు ఇస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చి రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. కర్ణాటకలో నాలుగు గంటల కరెంట్ కూడా ఇవ్వడంలేదని, నాలుగు గంటల్లో 20నుంచి 30 సార్లు ట్రిప్ అవుతున్నదని, ఇలా కరెంట్ ఇస్తే.. మన దగ్గర రైతులు బతుకుతారా.. అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ ఇస్తే మూడు ఎకరాలు పారుతాయని అంటున్నాడని, 3 గంటల కరెంట్ సరిపోతుందా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో కరెంట్‌తోపాటు రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నామన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయని, పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేసి కర్ణాటక లెక్క ఆగమాగం కావొద్దని ఆయన ఓటర్లకు హితవుపలికారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్లను రూ.2000లకు పెంచిందని, మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5000 వరకు పెంచుతామని హరీశ్ రావు హామీ ఇచ్చారు. రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గృహలక్ష్మి, కేసీఆర్ కిట్.. ఇలా ఎన్నో పథకాలు అమలు చేశామని, మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మహిళలకు రూ.3వేలు ఇచ్చే సౌభాగ్యలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామన్నారు.

### బీఆర్‌ఎస్‌ది మంచి మ్యానిఫెస్టో

కేసీఆర్ అంటే ఒక నమ్మకమని, ప్రజలకు కేసీఆర్‌పై విశ్వాసమున్నదని, ప్రతి ఒక్క హామీని కూడా కేసీఆర్ అమలుచేశారని హరీశ్ రావు అన్నారు. ఓట్ల కోసం, ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కొత్త హామీలతో ఝూటా మ్యానిఫెస్టో తీసుకొస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఏదిపడితే అది రాసుకుపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆ మ్యానిఫెస్టోను నమ్మితే.. కర్ణాటక ప్రజలకు పట్టిన గతే మనకు పడుతుందన్నారు. కరోనా సమయంలో కేసీఆర్ ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని గుర్తుచేశారు.

### ముస్లింల అధోగతికి కాంగ్రెస్ పాలనే కారణం..

రాష్ట్రంలో ముస్లింల పేదరికానికి 60ఏండ్ల కాంగ్రెస్ పాలనే కారణమని, కాంగ్రెస్ పాలనలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ఎలాంటి కృషీ జరగలేదని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ ఒక సెక్యులర్ లీడరని, కేసీఆర్ పాలనలో ఎక్కడా మతకలహాలు జరగలేదని అన్నారు.



నిజామాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



నిజామాబాద్ రోడ్‌షో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా, పక్కన మేయర్ నీతూకిరణ్



బోధన్ ప్రజా ఆశీర్వాద సభలో కార్యకర్తలకు విజయకేతనం చూపిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్



నందిపేటలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సాటాపూర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

### బిగాలను గెలిపిస్తే బాగుపడతాం..

కరోనా విపత్కర సమయంలో ప్రజల వెన్నంటే ఉన్న వ్యక్తి బిగాల గణేశ్ గుప్తానేనని, గల్లీగల్లీకి తిరిగి ప్రజలకు ధైర్యం చెప్పారని మంత్రి హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రజల కష్టసుఖాల్లో ఉన్న వ్యక్తి బిగాల గణేశ్ గుప్తానేనని, అన్నం పెట్టి కడుపులో పెట్టుకొని చూసుకున్నారన్నారు. ఒకప్పటి నిజామాబాద్‌కు, ఇప్పటికీ ఎంతో తేడా ఉన్నదని, రోడ్లు, పార్కులు, వైకుంఠధామాలు, సర్కారు దవాఖానలో మెరుగైన వైద్యం అందేలా కృషి చేశారన్నారు. ఒక్కసారి ఆలోచన చేయాలని, బిగాల గణేశ్‌గుప్తా, సీఎం కేసీఆర్‌లను గెలిపిస్తే మనం బాగు పడుతామని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మనం బాధపడుతామన్నారు. 30న కారు గుర్తుకు ఓటు వేసి బిగాల గణేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే బిగాల మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో నగరాన్ని సుందరంగా తీర్చిద్దామని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.





నిజామాబాద్ ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు, మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు (ఇన్‌సెట్‌లో..)

### షకీల్‌ను గెలిపిస్తే ప్రమోషన్ ఖాయం..

'బోధన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి గతంలో నీళ్ల మంత్రిగా ఉండి కూడా ఈ ప్రాంతానికి తాగునీరు అందించలేదు.. సాగు నీరు కూడా ఇవ్వలేదు.. ఆనాడు నిజాంసాగర్ ఆయకట్టు చివరికి భూములకు నీళ్లు రావాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది.. మీ ఎమ్మెల్యే షకీల్ నేను ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు పట్టుబట్టి వందల కోట్ల నిధులు తీసుకువచ్చి ఆ కాల్వలను బాగుచేయించిండు..' అని మంత్రి హరీశ్ రావు అన్నారు. బోధన్ – నిజామాబాద్ రోడ్డును రూ.30 కోట్లతో విస్తరింపజేశామని అన్నారు. నవీపేట్ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని రూ.6.5 కోట్లతో నిర్మించామని తెలిపారు. బాసర రోడ్డును రూ.55 కోట్లతో నాలుగులేన్లుగా విస్తరింపజేశామన్నారు. షకీల్‌కు వచ్చే సర్కార్‌లో పెద్ద పదవి రావాలంటే ఆయన్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు.



**ఆశీర్వదించి గెలిపించండి: ఎమ్మెల్యే మహ్మద్ షకీల్**

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న తనను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఓటర్లను కోరారు. మరోసారి కేసీఆర్‌ను సీఎంగా చూడాలని ఆయన చెప్పారు.



నందిపేటలో రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

### సీఎం కేసీఆర్ నమ్మిన బంటు జీవన్‌రెడ్డి



ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో మూడోసారి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి హరీశ్‌రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వస్తే గోస పడుతం, బీఆర్‌ఎస్ వస్తే బాగు పడుతామని, తొమ్మిదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జీవన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు నమ్మిన బంటు అని, మరోసారి గెలిస్తే ప్రమోషన్ వస్తుందని, భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జీవన్‌రెడ్డికి పోటీగా నిలిచిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు డిపాజిట్లు రాకుండా చూడాలని, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే జీవన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

**భారీ మెజార్టీతో గెలిపించాలి: ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**

సీఎం కేసీఆర్ ఎప్పుడూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు, రైతుల శ్రేయస్సు కోసం ఆలోచిస్తారని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజల బాగుకోసమే ఎన్నో పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేశారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని పథకాలు అమలుకానున్నాయని, వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.